క్లుప్తంగా

పట్టాలు ఇప్పించండి



ఈడీ మాట్లాడుతున్న మహిళా రైతులు

ఆదిలాబాద్‌రూరల్: ల్యాండ్ పర్చేస్ స్కీమ్ కింద ఒక్కొక్క లబ్ధిదారుడికి ఎకరం భూమి ఇవ్వడం జరిగిందని, ఆ భూములకు పట్టాలు ఇప్పించాలని మావల మండలంలోని బట్టిసావర్‌గాం గ్రామానికి చెందిన పలువురు ఎస్సీ లబ్ధిదారులు ఎస్సీ కార్పొరేషన్ ఈడీ మనోహర్‌ను కోరారు. ప్రభుత్వం తమకు 1991–92 సంవత్సరంలో ఎకరం భూమి ఇవ్వడం జరిగిందన్నారు. తమకు ఎల్‌పీఎస్ కింద ఇచ్చినా భూములకు పట్టాలు లేకపోవడంతో రైతుబంధు పథకాలకు దూరం అవుతున్నామన్నారు.

భోగి పూజలు

ఇచ్చోడ: మండలంలోని రఘూగూడలో బుధవారం భోగిపూజలను ఘనంగా నిర్వహించారు. గుస్సాడీలు ధరించే టోపీలకు ప్రత్యేక పూజలు చేశారు. ఏత్మసార్ దేవతలకు పూ జలు చేసి నైవేద్యాలు సమర్పించారు. భోగి పూజల అనంతరం దండారీ ఉత్సవాలను ప్రా రంభించారు. గ్రామపటేల్ ఆడ భీంరావు, దేవారి గంగారాం, పరమేశ్, మంతు పాల్గొన్నారు.

సరుకుల్లో నాణ్యత పాటించాలి

నార్నూర్: కేజీబీవీ పాఠశాల సరుకుల్లో నాణ్యత పాటించాలని ఎంఈవో పవార్ అనిత అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ పాఠశాలను ఆమె తనిఖీ చేశారు. వంటగది, స్టోర్ రూం, తరగతి గదులను పరిశీలించారు. విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారిస్తూ.. మెనూ ప్రకారం భోజనం అందించాలన్నారు. ఆమె వెంట ఎస్‌వో శైలజ, పాఠశాల సిబ్బంది ఉన్నారు.

రేపు కుమురం సూరు వర్ధంతి

కైలాస్‌నగర్: గిరిజన వీరుడు కుమురం సూరు వర్ధంతిని ఈనెల 17న ఉట్నూర్ మండలంలోని కొలాంగూడ దంతన్‌పల్లి గ్రామంలో నిర్వహిస్తున్నట్లు ఆదిమ గిరిజన కొలంసేవా సంఘం నాయకులు తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ రాజర్షి షా చేతుల మీదుగా వాల్ పోస్టర్ ఆవిష్కరించారు. కోలాం గిరిజనులు అధికసంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు. ట్రైనీ కలెక్టర్ సలోని, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

డీసీసీ అధ్యక్ష పదవికి దరఖాస్తు

తాంసి: మండల కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు కొడాల సంతోశ్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్ష పదవి కోసం దరఖాస్తు చేసుకున్నారు. బుధవారం ఇచ్చోడలో నిర్వహించిన పార్టీ సమావేశంలో కాంగ్రెస్ ఏఐసీసీ పరిశీలకుడు అజయ్ సింగ్‌ను మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సన్మానం చేశారు. దరఖాస్తును ఏఐసీసీ పరిశీలకుడు అజయ్ సింగ్‌కు అందించారు.

యువతకు అవకాశం ఇవ్వాలి

బోథ్: కాంగ్రెస్ పదవుల్లో యువతకు 50 శాతం అవకాశం కల్పించాలని పార్టీ జిల్లా అధికార ప్రతినిధి పసుల చంటి, ఏఐసీసీ పరిశీలకులు అజయ్ సింగ్‌ను కోరారు. ఈ సందర్భంగా ఆయన ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్ష పదవికి ఆయన దరఖాస్తు చేసుకున్నారు. పార్టీ కష్టకాలంలో నిబద్ధతతో పనిచేశానని, ఏడేళ్లలో జరిగిన అన్ని ఎన్నికలలో పార్టీ తరఫున కష్టపడ్డానని వివరించారు.

ఈ-కేవైసీతో ఉపాధి పనులు

ఇంద్రవెల్లి: ఈ కేవైసీ పూర్తి చేస్తేనే ఉపాధి పనులు కల్పించడం జరుగుతుందని ఎంపీడీవో జీవన్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంతో పాటు పలు గ్రామాలను సందర్శించి ఈజీఎస్ సిబ్బంది నిర్వహించిన ఈ కేవైసీని పరిశీలించారు. కేంద్ర ప్రభుత్వ ఉపాధి పనులు పకడ్బందీగా నిర్వహించేందుకు ఈకేవైసీ తీసుకువచ్చిందన్నారు.

నిధులు మంజూరు చేయాలి

బోథ్: దీపావళి పండుగ సందర్భంగా గోండ్వాన రాయిసెంటర్ ఆధ్వర్యంలో దండారీ ఉత్సవాల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే నిధులు మంజూరు చేయాలని రాజ్‌గోండ్ సేవా సమితి జిల్లా అధ్యక్షుడు పంద్రం శంకర్ డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలో మాట్లాడారు. గోండ్ గూడెంలో వారం రోజుల పాటు జరిగే దండారీ ఉ త్సవాలకు సంబంధించిన చెక్కులు పంపిణీ చేయాలన్నారు. నాయకులు దుర్వ విశ్వేశ్వర్ రావు, కనక అమత్‌రావు, ఆడేం భీంరావ్, మా డవి గంగారాం, నీలకాంత్ పటేల్, తొడసం గోపాల్, మండడి మోహన్, రమేశ్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి


ఇచ్చోడ: ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఏఐసీసీ పరిశీలకులు అజ య్‌సింగ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన సంఘటన్ శ్రీజన్ అభియాన్‌లో భాగంగా డీసీసీ పదవి ఎంపికపై కార్యకర్తలు, నాయకుల నుంచి వ్యక్తిగతంగా, లిఖిత పూర్వకంగా అభిప్రాయాలు సేకరించా రు. కాంగ్రెస్‌ను మరింత బలోపేతం చేయాలన్నా రు. సమావేశంలో ఆదిలాబాద్ మాజీ ఎంపీ సోయం బాపురావు, వేనుగోపాలచారి, ఆడే గజేందర్, కంది శ్రీనివాస్‌రెడ్డి, డీసీసీబీ చైర్మన్ అడ్డి భో జారెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

'ఉల్లి' కంపు..!



ఆదిలాబాద్ రిమ్స్ ఆసుపత్రిలో రోగులకు భోజనాన్ని సరఫరా చేసే వంటశాలలో ఉపయోగించే ఉల్లిగడ్డలు కంపుకొడుతున్నాయి. అధికారుల పర్యవేక్షణ లోపంతో అక్కడి సిబ్బంది నాసిరకం సరుకులను కొనుగోలు చేసి వంటలకు ఉపయోగిస్తున్నారు. తక్కువ ధరకు వస్తుందనే ఉద్దేశ్యంతో నాసిరకం వాటిని ఎక్కువ మొత్తంలో తీసుకువచ్చి నిల్వ చేస్తున్నారు. వాటితో తయారు చేసే భోజనాన్ని అందిస్తుండటంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారు.
– సాక్షి, ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్

ప్రమాదకరంగా విద్యుత్ తీగలు



బేల మండలంలోని టాక్లీ శివారులోని పొలాల్లో విద్యుత్ స్తంభాలు, తీగలు ప్రమాదకరంగా మారాయి. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని రైతులు భయాందోళన చెందుతున్నారు. సరిచేయాలని అధికారులకు విన్నవించినా.. పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. – బేల

ఇందిరమ్మ ఇళ్లకు భూమిపూజ



ప్రొసీడింగ్ పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే

ఉట్నూర్‌రూరల్: మండలంలోని ఘన్పూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లకు ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు భూమిపూజ చేశారు. 45 మంది లబ్ధిదారులకు బుధవారం ప్రొసీడింగ్ పత్రాలు అందజేశారు. అనంతరం నిర్మాణంలో ఉన్న ఇళ్లను పరిశీలించారు. కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమ పథకాలతో ముందుకు వెళ్తుందన్నారు.

రుణాల పేరిట వల

- ఏజెన్సీ గ్రామాల్లో విస్తరిస్తున్న మైక్రోఫైనాన్స్
- వీధిన పడుతున్న కుటుంబాలు.



నార్నూర్: ఏజెన్సీ ప్రాంతాలపై మైక్రో ఫైనాన్స్ సంస్థలు గురిపెట్టాయి. పదేళ్ల క్రితం పేద కుటుంబాలను చిన్నాభిన్నం చేసిన సంస్థలు ఇటీవల కాలంలో మళ్లీ చాప కింద నీరుల తమ వ్యాపార కార్యకలాపాలను మొదలుపెట్టాయి. అమాయక పేద ప్రజల అవసరాలే ఆసరాగా అధిక వడ్డీలకు రుణాలు ఇచ్చి వారి నడ్డి విరుస్తున్నాయి.

పోటాపోటీగా వడ్డీ వ్యాపారం..

పేర్లు వేరైనా మైక్రో ఫైనాన్స్ వ్యాపారం వారి లక్ష్యం. పదుల సంఖ్యలో గ్రామాలలో కార్యాలయాలను ఏర్పాటు చేసుకొని దందా సాగిస్తున్నాయి. రూ. 8 వేల నుంచి రూ. 50 వేల వరకు మహిళలకు రుణాలు ఇస్తున్నాయి. గ్రూపులు ఏర్పాటు చేసి అక్రమ దందాకు తెరతీశాయి. అవసరాన్ని బట్టి 100కు రూ. 3 నుంచి రూ. 5 చొప్పున వడ్డీ వసూలు చేస్తున్నాయి. వడ్డీ చెల్లింపులు ఆలస్యమైతే పెద్ద మొత్తంలో జరిమానాలు విధిస్తూ.. వారి ముక్కు పిండి వసూలు చేస్తున్నాయి. వీరి ఆగడాలు భరించలేక గ్రామాలను వదిలిన వెళ్లిన ఘటనలు వెలుగు చూస్తున్నాయి.

కంపెనీలపై నియంత్రణ ఏది..

మైక్రో ఫైనాన్స్ సంస్థలపై ప్రభుత్వం నిషేధం విధించినప్పటికీ మారిన పరిస్థితుల్లో సరళీకరణ ముసుగులో మళ్లీ వసూళ్ల పర్వం కొనసాగుతూనే ఉంది. ఏజెన్సీ ప్రాంతంలో ఇలాంటి అనుమతులు లేకుండానే కోట్ల రూపాయల లావాదేవీలు జరుపుతున్నా.. అధికారులు మాత్రం చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. ప్రభుత్వాలు కూడా వీటిని నియంత్రించకపోవడంతో రెచ్చిపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం

నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా వడ్డీ వ్యాపారం చేస్తే చర్యలు తీసుకుంటాం. ఇప్పటి వరకు మైక్రోఫైనాన్స్ వేధింపులు కానీ వడ్డీ వ్యాపారంపై ఎటువంటి ఫిర్యాదు రాలేదు. గతంలో జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు వడ్డీ వ్యాపారం చేసే వారి ఇళ్లలో సోదాలు నిర్వహించడం జరిగింది.
– ప్రభాకర్, సీఐ నార్నూర్

అకాల వర్షం.. అపార నష్టం

ఇంద్రవెల్లి: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో బుధవారం మధ్యాహ్నం కురిసిన అకాల వర్షానికి చేతికొచ్చిన మొక్కజొన్న, సోయాబీన్, పత్తి పంటలు దెబ్బతిన్నాయి. మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డులో అరబెట్టిన మొక్కజొన్న, సోయాబీన్ పూర్తిగా తడిసిపోయింది. చేతికి వచ్చిన పంటలు నష్టపోయామని రైతులు ఆందోళన చెందుతున్నారు.

జైనథ్: మండలంలో బుధవారం మధ్యాహ్నం కురిసిన వర్షానికి సోయాబీన్ రైతులు నష్టపోయారు. కొంతమంది రైతులు మార్కెట్‌లో పంటను అరబెట్టారు. పూర్తిగా తడిసిపోయింది. ఇటు ప్రకృతి సహకరించక, ప్రభుత్వం నుంచి ఎలాంటి పరిహారం రాకా రైతులు బిక్కుబిక్కుమంటున్నామన్నారు. అధికారులు సరేచేసి ఆదుకోవాలని కోరుతున్నారు.



తడిసిన మొక్కజొన్న పంట

సిరికొండ: మండలంలో బుధవారం అకాల వర్షం కురవడంతో రైతులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. అరబెట్టిన సోయా, మొక్కజొన్న పంటలు పూర్తిగా తడిసిపోయాయి. ఓ వైపు ప్రభుత్వ మద్దతు ధర లేక, మరోవైపు వర్షాలు వదలక అన్నదాతలను ఆగమగం అవుతున్నారు.

సొంతింటి కల నెరవేర్చేందుకే 'పీఎం ఆవాస్‌యోజన'

ఆదిలాబాద్: పేదల సొంతింటి కల నెరవేర్చేందుకే కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకాన్ని తీసుకువచ్చిందని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని మహాలక్ష్మివాడ కాలనీలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు. రాష్ట్ర ప్రభుత్వ వాటాతో కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద ఇళ్లను మంజూరు చేస్తుందన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ నజీర్, బీజేపీ నాయకులు మహేందర్, లాలమున్న, జోగు రవి, భీమ్సేన్ రెడ్డి, రాకేశ్, స్వప్నిల్, కేశవ్, జైపాల్ పాల్గొన్నారు.

ఆదిలాబాద్: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో డివిజన్ స్థాయి గిరిజన క్రీడోత్సవాలను బుధవారం ప్రారంభించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు క్రీడలకు ఎంతో ప్రాధాన్యతనిస్తున్నాయని అన్నారు. ఏటీడీవో నిహారిక, డీవైఎస్‌వో జక్కుల శ్రీనివాస్, కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రాష్ట్రపాల్, అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రతినిధులు రాజేశ్, పెటా అసోసియేషన్ కోశాధికారి శ్రీనివాస్, పీడీలు లక్ష్మణ్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.



భూమిపూజ చేసి పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

జైనథ్: మారుతున్న కాలంతో పాటు విద్యార్థులు సాంకేతికతను పెంపొందించే పరిజ్ఞానం ఎంతగానో దోహదపడుతుందని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. జైనథ్ మండలంలోని అడ గ్రామంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో బుధవారం ఆశ ఫర్ ఎడ్యుకేషన్ సహకారంతో ఏకలవ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్మార్ట్ కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రారంభించారు. ఎంఈవో శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయులు గుణవంతురావ్, ఏకలవ్య ఫౌండేషన్ కోశాధికారి సతీష్, దేశ్ పాండే, ప్రోగ్రాం మేనేజర్ ప్రశాంత్ పాల్గొన్నారు.

గిరిజనుల అభివృద్ధి కోసమే 'ఆదికర్మయోగి'

ఇచ్చోడ: గిరిజనుల అభివృద్ధి కోసమే కేంద్ర ప్రభుత్వం ఆది కర్మయోగి పథకాన్ని ప్రారంభించినట్లు ఎంపీడీవో ఆనంద్ అన్నారు. బుధవారం మండలంలోని మల్యాల్‌లో నిర్వహించిన ఆది కర్మయోగి గ్రామసభలో పాల్గొని మాట్లాడారు. ప్రతీ గిరిజనుడికి ఈ పథకం చే రేందుకు గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తెలి పారు. బుధవారం మండలంలో గేర్జం, మాన్కపూర్, మాదపూర్, దాబా(కే), సిరిచెల్మ గ్రామసభలు నిర్వహించారు. ఇందులో పాల్గొన్న గిరి జనులతో ప్రతిజ్ఞ చేయించారు.

బోథ్: కేంద్ర ప్రభుత్వ 'ఆది కర్మయోగి అభియాన్' కార్యక్రమంలో భాగంగా, బోథ్ మండలంలోని ఎనిమిది గ్రామ పంచాయతీలలో బుధవారం ప్రత్యేక గ్రామసభలు నిర్వహించారు. మండలంలోని నిగిని, కంటేగాం, బాబెరా నక్కలవాడ, కరత్వాడా, పట్నాపూర్, నాగపూర్, అందూర్ గ్రామాల్లో నిర్వహించిన సభల్లో రాబోయే ఐదేళ్లలో గిరిజన గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల అభివృద్ధి, వ్యక్తిగత ఆస్తుల కల్పన కోసం ప్రణాళికలు సిద్ధం చేయనున్నట్లు అధికారులు గ్రామస్తులకు వివరించారు.



బోథ్: గ్రామంలో పర్యటిస్తున్న ఎంపీడీవో రమేశ్

క్రీడాకారులు జాతీయస్థాయికి ఎదగాలి

బజార్‌హత్నూర్: డివిజన్ స్థాయి క్రీడాపోటీల్లో పాల్గొంటున్న విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చి జాతీయస్థాయి క్రీడాకారులుగా ఎదగాలని ఏటీడీవో అమిత్ అన్నారు. బుధవారం మండలంలోని జాతర్ల ఆదర్శ క్రీడాపాఠశాల మైదానంలో బోథ్ డివిజన్ స్థాయి క్రీడా పోటీలు నిర్వహించారు. కబడ్డీ, వాలీబాల్, అథ్లెటిక్స్ విభాగాల్లో 14 గిరిజన ఆశ్రమ పాఠశాలల బాల, బాలికలు పాల్గొన్నారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను నవంబర్‌లో ఉట్నూర్‌లో జరిగే జోనల్‌స్థాయి క్రీడా పోటీలకు ఎంపిక చేయనున్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు గొడం చందన్, ఆత్రం భాస్కర్, కిషన్ రెడ్డి, గంగారాం, అంబారావ్, స్వర్ణలత, కృష్ణరావు, కోచ్‌లు కార్తీక్, హతిరాం, సాహుల్, సురేందర్, సంతోష్, భీంరావ్ పాల్గొన్నారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న అమిత్

భీం, సూరులకు నివాళి



నివాళులర్పిస్తున్న నాయకులు

బేల: మండల కేంద్రంలోని కుమురం భీం చౌరస్తాలో బుధవారం ఆదివాసీ పోరాట యోధులకు ముురం భీం వర్ధంతిలను రాయిసెంటర్, ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. జాతీయ రహదారిపై ర్యాలీ నిర్వహించి, వారి చిత్రపటాలకు నివాళులర్పించారు. కార్యక్రమంలో నా యకులు కొరంగే సోనేరావు, నందకుమార్, కొరంగే జంగ్‌షా, మేస్రం వాసుదేవ్, ఆడ శంకర్, గేడం రమేశ్, కుషాల్‌రావు, కొడప భీంరావు పాల్గొన్నారు.

బహిరంగ వేలం వాయిదా

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ పట్టణంలోని గాంధీ పార్కు ఆవరణలో గల ఉసిరిబ్లాక్‌లోని సుబాబుల్, గుల్‌మోహర్ చెట్ల తొలగింపు, పార్కు సుందరీకరణ కోసం చేపట్టిన బహిరంగ వేలంను ఈనెల 18వ తేదీకి వాయిదా వేసినట్లు జిల్లా ఉద్యానవన, పట్టు పరిశ్రమ అధికారి నర్సయ్య ప్రకటనలో తెలిపారు.

వడ్డీ వ్యాపారిపై కేసు

ఆదిలాబాద్‌టౌన్: వడ్డీ వ్యాపారిపై కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ సీఐ సునీల్ కుమార్ తెలిపారు. ఆదిలాబాద్ పట్టణంలోని దోబికాలనీకి చెందిన ఏంఎ ముఖీంకు డబ్బులు అవసరముండగా హైదరాబాద్‌కు చెందిన ఎండీ సిరాజ్ అనే వ్యక్తి వద్ద మధ్యవర్తి సబీయా ద్వారా గతేడాది మార్చి 24న రూ.6లక్షలను అప్పుగా తీసుకున్నాడు. డబ్బులివ్వకపోతే తనఖా పెట్టిన ఇంటిని స్వాధీనం చేసుకుంటానని బెదిరిండంతో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో వడ్డీ వ్యాపారిపై కేసు నమోదు చేసినట్లుగా వివరించారు.

పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేయించాలి

ఇచ్చోడ/నేరడిగొండ/ఉట్నూర్‌రూరల్/తలమడుగు: పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేయించాలని ఇచ్చోడ మండల పశువైద్యాధికారి గోవింద్‌నాయక్ అన్నారు. అడేగామ(బి)లో పశువులకు ఉచిత గాలికుంటు నివారణ టీకాలు వేశారు. నేరడిగొండ మండలంలోని రాజుర గ్రామంలో ఉచిత గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని పశువైద్యాధికారి రాథోడ్ జీవన్ ప్రారంభించారు. ఉట్నూర్ మండలంలోని చింతకర్ర, కుమ్మరితండాల్లో గ్రామాల్లో పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేశారు. తలమడుగు మండలం పల్లి(బి) గ్రామంలో గాలికుంట నివారణ టీకాల కార్యక్రమాన్ని పశువైద్యాధికారి లావణ్య ప్రారంభించారు.



ఇచ్చోడ: టీకాలు వేస్తున్న పశువైద్యాధికారి

ప్రారంభమైన దండారీ సంబురాలు

ఇంద్రవెల్లి/ఉట్నూర్‌రూరల్/సిరికొండ: ఆయా మండలాల్లోని గ్రామాల్లో దండారీ ఉత్సవాలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. యేత్మసార్ దేవతలకు ప్రత్యేక పూజలు చేసి, మొక్కులు చెల్లించారు. ఇంకో గ్రామానికి అతిథిగా వెళ్లి, ఇతర దండారీ బృందాలకు మర్యాదలు చేస్తేన్నారు. వారం రోజుల పాటు గుస్సాడీ నృత్యం ఆకట్టుకోనుంది. దీపావళి తరువాత కోలాబోడి పూజతో ఉత్సవాలు ముగియనున్నట్లు ఆదివాసీ పెద్దలు తెలిపారు.



నైవేద్యం సమర్పిస్తున్న మహిళలు

సీపీఆర్‌పై అవగాహన

ఇచ్చోడ/భీంపూర్/నార్నూర్/నేరడిగొండ: సీపీఆర్‌తో మనిషి ప్రాణాలు కాపాడవచ్చని 108 ఉమ్మడి జిల్లా ప్రోగాం మేనేజర్ సామ్రాట్ అన్నారు. బుధవారం ఇచ్చోడ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సీపీఆర్ విధానంపై అవగాహన కల్పించారు. భీంపూర్ మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మండల వైద్యాధికారి నిఖిల్ రాజ్, ఆరోగ్య విస్తీర్ణాధికారి లింగంపల్లి జ్ఞానేశ్వర్, సీపీఆర్‌పై అవగాహన కల్పించారు. సీపీఆర్‌పై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని ఏజెన్సీ జిల్లా అదనపు వైద్యాధికారి మనోహర్ అన్నారు. నార్నూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. నేరడిగొండ మండలంలోని కుమారి జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది అవగాహన కల్పించారు.



అవగాహన కల్పిస్తున్న అధికారులు

లారీ ఢీకొని ఒకరికి గాయాలు

సాత్నాల: భోరజ్ మండలంలోని ఎన్‌హెచ్ 44 అంతర్రాష్ట్ర రహదారిపై రోడ్డు ప్రమాదంలో ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. ఎస్సై గౌతమ్ పవార్ వెల్లడించిన వివరాల ప్రకారం గురుగావ్ నుంచి బెంగుళూరు వెళ్తున్న కంటైనర్, భోరజ్ చెకపోస్ట్ వద్ద రోడ్డు దాటుతున్న గంభీర్‌ను అతివేగంగా వచ్చి ఢీకొట్టింది. దీంతో ఆయన కాలికి గాయాలయ్యాయి. తక్షణమే స్థానికులు స్పందించి క్షతగాత్రుడిని రిమ్స్‌కు తరలించారు. ప్రస్తుతం ఆయన పరిస్థితి స్థిరంగా ఉన్నట్లు వైద్యులు వెల్లడించారు. బాధితుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గౌతమ్ పవార్ వెల్లడించారు.

రెండు బైక్‌లు ఢీ.. ముగ్గురికి గాయాలు

నేరడిగొండ: రెండు బైక్‌లు ఢీకొన్న ఘటనలో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. బుధవారం మండలంలోని మాదాపూర్ గ్రామ సమీపంలో ఇచ్చోడ మండలం జోగిపేట్ గ్రామానికి చెందిన షేక్ నసీర్, షేక్ ముజాహిద్ వాగ్దారి నుంచి బైక్‌పై వెంకటాపూర్ వైపు వెళ్తూ మాదాపూర్ గ్రామ సమీపంలో ఎదురుగా వస్తున్న తర్లం గ్రామానికి చెందిన కుమార్ బైక్‌ను ఢీ కొట్టారు. దీంతో అదుపుతప్పి బైక్‌లు బోల్తా పడడంతో ముగ్గురికి గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు 108లో ఆస్పత్రికి తరలించారు. అతివేగం, అజాగ్రత్తతోనే ప్రమాదం జరిగిందని స్థానికులు తెలిపారు.

గంజాయి నిందితుడిపై కేసు

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని చిల్కూరిలక్ష్మినగర్‌కు చెందిన నిందితుడు షేక్ అమీర్‌పై కేసు నమోదు చేసినట్లు వన్ టౌన్ సీఐ సునీల్ కుమార్ తెలిపారు. బుధవారం పట్టణంలోని నటరాజ్ థియేటర్ సమీపంలో గంజాయి విక్రయిస్తున్నట్లు సమాచారం రావడంతో దాడి చేయగా నిందితుడి వద్ద 21 గ్రాముల గంజాయి లభించినట్లుగా తెలిపారు.

పశువుల వాహనం పట్టివేత

బేల: మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై బుధవారం వాహనాలు తనిఖీ చేస్తున్న క్రమంలో అక్రమ పశువులను తరలిస్తున్న వాహనాన్ని పట్టుకున్నట్లు ఎస్సై మధుకృష్ణ పేర్కొన్నారు. పశువులను గోశాలకు తరలించి, వాహనాన్ని సీజ్ చేశామన్నారు. డ్రైవర్ మట్టే గిరిధర్‌పై కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించామని తెలిపారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం

భీంపూర్: పౌష్టికాహారంతో ఆరోగ్యం కలుగుతుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాధా అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మాట్లాడారు. విద్యార్థులకు తప్పనిసరిగా పౌష్టికాహారం అందించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో గోపాలకృష్ణారెడ్డి, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు మరమ్మతులు

సాత్నాల: భోరజ్ మండలంలోని జాతీయ రహదారి 353బి తర్లంలో లెవెల్ వంతెన వద్ద రోడ్డుకు ఆర్ అండ్‌బీ అధికారులు మరమ్మతులు చేశారు. సీసీ రోడ్డు వేసి వాటర్ క్యూరింగ్ అయ్యాక రాకపోకలకు అనుమతిస్తామన్నారు. వాహనదారులు లాండసాంగి, ఆడ, నిరాల మీదుగా వెళ్లాలని సూచించారు.

సంక్షిప్త వార్తలు

పీఆర్టీయూ చేయూత

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాలోని తాంసి మండలం వడ్డాడి గ్రామ ప్రభుత్వ పాఠశాలలో పనిచేసిన కరీం అన్సారీ ఇటీవల మృతి చెందారు. బాధిత కుటుంబానికి ప్రోగ్రెసివ్ రికగ్నైజ్డ్ టీచర్స్ యూనియన్ (పీఆర్టీయూ) సంక్షేమ నిధి నుంచి లక్ష రూపాయల చెక్కును బుధవారం అందజేశారు. కారుణ్య నియామకాల్లో భవిష్యత్‌లో కుటుంబానికి అండగా ఉంటామని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు కొమ్ము కృష్ణ కుమార్ భరోసానిచ్చారు. నాయకులు డి.గోవర్ధన్, చోప్‌డే రాజు, అరె భాస్కర్, వినోద్ రెడ్డి, జక్కుల రవి, తుల శ్రీనివాస్ పాల్గొన్నారు.

డిగ్రీ అధ్యాపకుడికి పీహెచ్‌డీ

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ కామర్స్ డిగ్రీ కళాశాలలో వాణిజ్య శాస్త్ర అధ్యాపకుడిగా పని చేస్తున్న కందుకూరి చంద్రకాంత్‌కు కామర్స్ విభాగంలో పీహెచ్‌డీ లభించింది. బుధవారం ఆయనను కళాశాల ప్రిన్సిపాల్ అతిక్ బేగం, వైస్ ప్రిన్సిపాల్ రఘు గణపతి శాలువాతో సత్కరించారు.

ఉచిత హోమియో వైద్య శిబిరం

ఆదిలాబాద్‌రూరల్: ఆదిలాబాద్ పట్టణంలోని మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల పాఠశాల, కళాశాలలో బుధవారం ప్రభుత్వ హోమియో డిస్పెన్సరీ రిమ్స్ (హెచ్‌క్యూ) ఆధ్వర్యంలో ఫ్లెక్సీపుల్ వయోమిత్ర ఉచిత మెగా హోమియో వైద్య శిబిరం నిర్వహించారు. పాఠశాల, కళాశాలలోని 296 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మాత్రలు పంపిణీ చేశారు. వైద్యులు ప్రీతీల్, డాక్టర్ కస్తాల చంద్రశేఖర్, శారద, డేవిడ్, మనోహర్ పాల్గొన్నారు.

అబ్దుల్ కలాం జయంతి

బోథ్: సొనాల మండల కేంద్రంలోని వివేకానంద పాఠశాలలో బుధవారం ఏపీజే అబ్దుల్ కలాం జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పాఠశాల ప్రిన్సిపాల్ కృష్ణ చైతన్య, శుద్ధోధన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న సమ్మె

ఉట్నూర్‌రూరల్: సమస్యలు పరిష్కరించాలని ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయం ఎదుట హాస్టల్స్ డైలీవేజ్, ఔట్‌సోర్సింగ్ కార్మికులు చేపడుతున్న సమ్మె బుధవారం 34వ రోజుకు చేరింది. మధ్యాహ్నం జోరు వర్షంలో సైతం సమ్మెను కొనసాగించారు. సమ్మెకు బీజేపీ నాయకులు మద్దతు తెలిపారు. 34 రోజుల పాటు సమ్మె చేస్తున్నా.. ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ధర్నాలో సీఐటీయూ నాయకులు రాజేందర్, నాల్గొ తరగతి ఉద్యోగులు పాల్గొన్నారు.